జెండా పండగ సందడి





అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో విక్రయానికి ఉంచిన జాతీయ జెండాలు, స్టిక్కర్లు, హ్యాండ్ బ్యాండ్లు

- ప్రత్యేక దుకాణాల ఏర్పాటు
- జోరుగా త్రివర్ణ పతాకాలు, హ్యాండ్ బ్యాండ్లు, స్టిక్కర్ల విక్రయాలు





జాతీయ జెండాలు, స్వాతంత్య్ర దినోత్సవ డెకరేషన్ సామగ్రి విక్రయ దుకాణాలు

సీతంపేట: బ్రిటీష్ సంకెళ్ల నుంచి దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన రోజు ఆగస్టు 15. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జరుపుకునే పండగ స్వాతంత్య్ర దినోత్సవం. ఆరోజున మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేసేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధమవుతారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, పార్టీ కార్యాలయాలు, ఆటో స్టాండ్లు ఇలా ప్రతి చోటా మువ్వన్నెల జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తుంటారు. జెండా పండగ కోసం చాలా మంది త్రివర్ణ పతాకాలు కొనుగోలు చేస్తుంటారు. దీంతో నగరంలో పలుచోట్ల జాతీయ జెండాల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. త్రివర్ణ పతాకాలతోపాటు స్టిక్కర్లు, బాడ్జీలు, రిస్ట్ బ్యాండ్లు, బైకులకు పెట్టే జెండాలు, డెకరేషన్ కోసం దండలు ఇలా సుమారు 21 రకాల వస్తువులను దుకాణాల్లో విక్రయిస్తున్నారు. వినియోగదారుల కొనుగోళ్లతో విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. సీతంపేట, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, పాలబూత్ సెంటర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి జెండాలు, స్టిక్కర్లు జోరుగా విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన



మురళీనగర్‌లో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్‌లో జరుగుతున్న రహదారుల విస్తరణ, నిర్మాణ పనులను ఆదివారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆయన పలు సూచనలిచ్చారు. ఏపీఎస్ రాజు, కృష్ణ, రాజు, ఇన్‌చార్జ్ ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం



జి.విజయలక్ష్మి

మర్రిపాలెం: ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్‌లో తల్లిదండ్రులతో కలిసి జి.విజయలక్ష్మి నివసిస్తోంది. ఈ నెల 11న కాలేజీకి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఫోన్ చేశారు. తాను ప్రేమించిన వ్యక్తితో తిరుపతి వెళ్తున్నానని చెప్పి విద్యార్థిని కాల్ కట్ చేసింది. విజయలక్ష్మి తల్లి జి.రామలక్ష్మి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామలింగేశ్వరుడికి ప్రదోష కాల పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి

సీతమ్మధార: త్రయోదశి సందర్భంగా ఆదివారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన రామలింగేశ్వర స్వామికి ప్రదోష కాల పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, భక్తులు నామ గోత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ సిబ్బంది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వేణుకుమార్ అనే వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వేణుకుమార్‌పై గుర్తు తెలియని కొందరు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. పోలీసులు ఆదివారం సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలించారు. దాడి చేసి పరారైన వారి గురించి ఆరా తీస్తున్నారు.

స్విమ్మింగ్‌లో ఆదర్శ్‌కు రజతం



పతకంతో ఆదర్శ్

సీతంపేట: ఆర్‌ఆర్ ఆక్వా స్పోర్ట్స్ ఆదివారం రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అక్కయ్యపాలేనికి చెందిన పి.ఆదర్శ్ రజత పతకం సాధించాడు. బాలుర గ్రూప్–2 విభాగంలో 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ ఈవెంట్‌లో ఆదర్శ్ ప్రతిభ చూపి పతకం సొంతం చేసుకున్నాడు. సీనియర్ కోచ్ లక్ష్మణ్ వద్ద శిక్షణ పొందుతున్న ఆదర్శ్ ఇటీవల జరిగిన పలు టోర్నీల్లో 50 మీటర్ల బటర్ ఫ్లై, ఫ్రీ స్టైల్ ఈవెంట్లలో పతకాలు సాధించి సత్తా నిరూపించుకుంటూ చిన్న వయసులో నిలకడగా రాణించడం విశేషం. ఈ సందర్భంగా ఆదర్శ్‌ను పలువురు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

మర్రిపాలెం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. పంజాబ్ హోటల్ జంక్షన్ దరి 53వ వార్డు కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్ బర్కత్ అలీ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. దాని కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. వార్డుకు సంబంధించిన ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల తీరుపై కె.కె.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, 53వ వార్డు సీనియర్ నాయకులు, వార్డు, కమిటీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చలనచిత్రాల నిర్మాణానికి ప్రభుత్వ సహకారం



సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఏపీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్, డ్యాన్స్ డైరెక్టర్స్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథి ఎస్‌వీకే సినిమా నిర్మాత, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం 500 మంది పేద కళాకారులకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖ నగరంలో చలనచిత్రాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఫిల్మ్ ఇండస్ట్రీ విశాఖ తరలి రావడానికి పలు సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు రాజా, రామారావు, రమేష్, నాగేంద్రమ్మ, నిర్మల భాను, విజయరమణి, శివ, మేరీ, సూర్య, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధ, ఏపీ టెక్ మెంబర్ సుశీల పాల్గొన్నారు.

అవయవదానాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలి



మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

సీతంపేట: పేదలకు ఉపయోగపడేలా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ప్రపంచ అవయవదాన వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. కేజీహెచ్ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి ఆపరేషన్ల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. అవయవదానం చేసిన వారి పిల్లలకు ప్రోత్సాహకంగా ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యా సిలబస్‌లో అవయవదానాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని, ఈ విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవదానంతో ఎంతో మందికి పునర్జన్మనిస్తున్న వారంతా దేవుళ్లతో సమానమన్నారు. అటువంటి కార్యాన్ని పెద్ద ఎత్తున చేస్తున్న గూడూరు మహాలక్ష్మి సేవలను అభినందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయవ దానం చేయడం వల్ల వారి నుంచి సేకరించిన గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు, ప్రేగులు, ఎముకలు, మూలుగ, కళ్లు మరణానికి చేరువైన వారికి అమర్చడం ద్వారా వారికి జీవితాన్ని ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. అవయవదానానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శరీరదాతలకు అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏఎంసీ ప్రొఫెసర్ వి.పద్మజ, అనకాపల్లి డీటీవో వి.ఎల్.సుభాషిణి, ట్రస్టు కార్యదర్శి ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

15న పద్యనాటక ప్రదర్శన

మురళీనగర్: స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా ఈ నెల 15న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం జెండా వందనం అనంతరం సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాల్లో నంది బహుమతి పురస్కార గ్రహీతలు శ్రీసాయి కళానికేతన్ నటులచే శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్యనాటకం ప్రదర్శిస్తామని తెలిపారు. వాకర్స్ క్లబ్ సీనియర్ సభ్యులు, రంగస్థల కళాకారులు దివంగత పెంటకోట వేంకట రమణ, దివంగత లంకా ఆదినారాయణల స్మారకంగా వారి కుమారులు పెంటకోట కుమార్ రాజా, లంకా వేంకట సుధాకర్‌ల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఈ నాటక ప్రదర్శనకు హాజరు కావాలని వారు కోరారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణ మాస శుద్ధ ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు





రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐ ధరేంద్ర, ఫోర్త్ టౌన్ సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: నగరంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను పోలీసులు హెచ్చరించారు. ఆదివారం ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ధరేంద్ర.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎవరు, ఎక్కడ ఏయే పనులు చేస్తున్నారో వివరాలు తెలియపరచాలని సూచించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

అష్టలక్ష్మి అమ్మవార్లకు విశేష హారతి



హారతి సమర్పిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి, మాతా రమ్యానంద భారతి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగంలో భాగంగా ఆదివారం సాయంత్రం అష్టలక్ష్మీ వైభవం అత్యంత ఘనంగా నిర్వహించారు. కుర్తాళ పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ వేద మంత్రాలతో అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అష్టలక్ష్మీ అమ్మవార్లకు హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ మాసం అధిక మాసంగా వచ్చిందన్నారు. అధిక మాసంలో పూజ, జప, హోమాలూ చేస్తే అధికమైన సత్ఫలితాలు వస్తాయని శ్రీమహావిష్ణువు అధిక మాస ప్రాశస్త్యంలో చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్పొరేట్ వర్గాలకే కేంద్రం పెద్దపీట



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు

సీతంపేట: కార్మిక ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ వర్గాల అభివృద్ధికి మోదీ సర్కార్ కృషి చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు విమర్శించారు. రామాటాకీస్ వద్ద ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభ ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఫాసిస్ట్ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవా రంగంలో బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడం వంటి నిర్ణయాల వల్ల దేశం ఆర్థికంగా దివాళా తీస్తోందని విమర్శించారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో స్టీల్‌ప్లాంట్ ఒక్కటని, దానిని కూడా నష్టాల సాకుతో ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చివేసిందన్నారు.

ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఎన్నిక..

13వ మహాసభ సందర్భంగా ఏఐటీయూసీ విశాఖ జిల్లా నూతన నాయకత్వం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎం.మన్మధరావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఎస్.జె.అచ్యుతరావు ఎన్నికయ్యారు. వారిని సభ్యులు అభినందించారు. ముందుగా ఏఐటీయూసీ జెండాను సీనియర్ నాయకుడు బి.సి.మసేన్ ఎగురవేశారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

- దేవమాత ప్రధాన ఉత్సవానికి ఏర్పాట్లు



నవదిన ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో నవదిన ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్లీవ్ గుర్తువీధిలో దేవమాత ఆలయం వద్ద జపమాల, దివ్య పూజా బలులు నిర్వహించారు. సాయంత్రం మేళ తాళాలతో దేవర ప్రసాదాల మాత అవతారంలో దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీవ్ గుర్తువీధి, రే బరిల్, సిరిల్ మాన్యువల్, డయాస్, నికోలస్ తదితర వీధుల్లో ఊరేగించారు. ఆగస్టు 15న దేవమాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో సుమారు రూ. 50 వేల వ్యయంతో ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు వై.అమర్‌దీప్, ఆదిరెడ్డి చార్లీ, పి.ఆనందరావు, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాలకు వేళాయె

- 17 నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణలక్ష్మి పూజలు



సిరులతల్లి కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15 వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రావణలక్ష్మీకి ప్రత్యేక కుంకుమ పూజలు చేస్తారు. ప్రత్యేక పూజలో సంకల్పం, లక్ష్మీ సహస్రనామాలు, లక్ష్మీ హోమం, అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం చేపట్టనున్నారు. పూజలో పాల్గొనే భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుంది. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శీచక్రయంత్రం (రాగి) మహాప్రసాదంగా అందజేస్తారు.

శ్రావణమాసం..పండగ పర్వదినాలు..

శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం(ఆగస్టు 25) రోజున వరలక్ష్మీవ్రతం, సెప్టెంబర్ 8వ తేదీ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాలు (ఈ నెల 18, 25, సెప్టెంబర్ 1, 8, 15) ప్రత్యేక పూజలు జరపనున్నారు.

17న ప్రారంభం..

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శ్రావణలక్ష్మీ పూజలను ప్రారంభించనున్నారు. ప్రత్యేక కుంకుమ పూజలో పాల్గొని అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. స్థానికేతరులు పూజలో పాల్గొనలేనిచో వారి గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటి చిరునామాకు పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

పూజా రుసుం ఎలా చెల్లించాలి..

పూజా రుసుం రూ.400 అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్‌లో చెల్లించాలి. మరిన్ని వివరాలకు 0891–2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించవచ్చు.

పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు

జగదాంబ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు జరుగుతున్నాయని విశాఖపట్నం తపాలా శాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆర్. రాహుల్ ఆదివారం తెలిపారు. దేశ ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగ 2.0'కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన నిమిత్తం ఈనెల 11న ఆర్‌కే బీచ్‌లో భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేందుకు తపాలా శాఖలో జాతీయ పతాకాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు, సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాహుల్ కోరారు.

చిన్నారులకు చెస్ పోటీలు



చదరంగం ఆడుతున్న చిన్నారులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో 76వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి నరసింహమూర్తి (శ్రీను) తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రంథాలయం ఆధ్వర్యంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ మంగళవారం ఉదయం పతాకావిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం, పాటల పోటీలు, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు ఉంటాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గోవాలని ఆయన కోరారు.

పబ్లిక్ డిమాండ్

దుర్వాసన భరించలేకపోతున్నాం..



శ్రీనగర్‌లో కూరగాయల బజారు వద్ద రోత పుట్టిస్తున్న వ్యర్థాలు

సీతంపేట: రామాటాకీస్ సమీపంలోని శ్రీనగర్ శివాలయం వీధి చివర ఉన్న కూరగాయల బజారు వద్ద డంపర్ బిన్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయి రోత పుట్టిస్తోంది. పారిశుధ్య సిబ్బంది పనితీరు అధ్వానంగా మారడంతో ఈ స్థితి నెలకొంది. డంపర్ బిన్ ఖాళీగా కన్పిస్తుంటే, దాని చుట్టూ చెల్లా చెదురుగా ఉన్న చెత్త నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక పోతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలి.

– వేణుగోపాల్, శ్రీనగర్